క్లుప్తంగా

మద్యంతాగి వాహనం నడిపితే చర్యలు



తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవికాంత్

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై రవికాంత్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే టప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలు జాగ్రత్తగా నడిపి గమ్యం చేరుకోవాలన్నారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

వన నర్సరీల సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధి ఎల్లంపల్లిలోని నర్సరీని శనివారం ఎంపీడీవో ఎం ఏ.అలీం పరిశీలించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో నాటే మొక్కల వివరాలతో పాటు నాణ్యమైన విత్తనాలు, మొలకలు వినియోగిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. అక్కడి నుంచి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే సరళిని పరిశీలించారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్


ఓదెల: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పొత్కపల్లి ఎస్సై డి.రమేశ్ అన్నారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 18ఏళ్లు పైబడినవారే ఆటో నడపాలన్నారు. ప్రతీఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి నడపరాదన్నారు. దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న డ్రైవర్ ఆనంద్‌ను ఎస్సై సన్మానించారు.

భారత్ భూషణ్ అవార్డుకు ‘ఈదునూరి’ ఎంపిక



కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సామాజికవేత్త, పలు సేవా సంఘాల నిర్వాహకుడు ఈదునూరి శంకర్ బీఆర్ అంబేడ్కర్ భారత్ భూషణ్ అవార్డుకు ఎంపికయ్యాడు. న్యూఢిల్లీలోని న్యూమహారాష్ట్ర సదన్‌లో వచ్చే ఏడాది జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సంస్థల నిర్వాహకులు డాక్టర్ మనీష్ గవాయి, ప్రియాంక సాతే తెలిపారు. కేంద్ర సామాజిక సాధికారికశాఖ మంత్రి రాందాస్ హత్వాలే, నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, నేషనల్ ఉమెన్ కమిషన్ చైర్మన్ విజయ కె.రహత్కర్ చేతుల మీదుగా శంకర్‌కు అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకుల ఉపేర్కొన్నారు. 20ఏళ్లుగా సామాజిక సేవ, దళిత చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నందుకు శంకర్‌కు అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు.

చివరి భూములకు సాగునీరు



సుల్తానాబాద్‌కు చేరిన ఎస్సారెస్పీ సాగునీరు

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల ఎస్సారెస్పీ కాలువలకు నీరు చేరింది. వారబంధి ద్వారా శనివారం సాగునీరు కోసం చివరి భూములకు వదిలినట్లు ఎస్సారెస్పీ ఈఈ ప్రసాద్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం రాత్రి చొప్పదండి మండలం రేవల్లిలో నీటిని ఎస్సారెస్పీ కాలువలకు వదిలామని, సుల్తానాబాద్ మీదుగా కాల్వశ్రీరాంపూర్ వరకు వెళ్లిన తర్వాత అక్కడి రైతులు వినియోగించుకుంటారని ఆయన తెలిపారు.



శివలింగం



కొలనూర్ శివాలయం (ఫైల్)

వెయ్యేళ్ల చరిత్రకు పునరుజ్జీవం

- కొలనూరులో శిథిలావస్థకు చేరిన కాకతీయుల కాలం నాటి శివాలయం
- పునరుద్ధరణకు నడుం బిగించిన గ్రామస్తులు
- రూ.కోటి వరకు విరాళాలు
- సీజీఎఫ్ నిధులు రూ.40లక్షలు మంజూరు
- చకచకా సాగుతున్న పనులు



చకచకా సాగుతున్న పనులు

ఓదెల: కొలనుల పక్కన ఉండడంతో ఆ ఊరికి కొలనూర్ పేరు వచ్చిందని ఆ గ్రామ పెద్దలు చెప్తుంటారు. గ్రామంలో కాకతీయుల శిల్పకళా నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన వెయ్యేళ్ల చరిత్ర గల శివాలయం ఉంది. నాడు వైభవంగా వెలుగొందిన ఆలయం శిథిలావస్థకు చేరింది. ఎలాగైనా గుడిని నిలబెట్టాలనే సంకల్పంతో గ్రామస్తులు నడుం బిగించారు. కమిటీ ఏర్పాటు చేసుకుని విరాళాలు సేకరించారు. గ్రామానికి చెందిన వ్యాపారులు, ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సింగరేణి కార్మికులు ఆలయ పునరుద్ధరణకు ముందడుగు వేశారు. ఆలయ అభివృద్ధికి 2023 అక్టోబర్‌లో అప్పటి ప్రభుత్వం చైర్మన్ కలకొండ రాజిరెడ్డి, ముగ్గురు సభ్యులను నియమించింది.

కొనసాగుతున్న పనులు..

ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో వెయ్యేళ్ల నాటి శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆలయ పునరుద్ధరణకు గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చారు. రూ.కోటి 2లక్షల విరాళాలు ప్రకటించగా ఇప్పటివరకు రూ.70లక్షలు జమయ్యాయని కమిటీ పేర్కొంది. గత ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల కింద ఆలయ నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు చేసింది. గ్రామస్తులు రూ.9.60లక్షలు కంట్రిబ్యూషన్ చెల్లించారు. గత ప్రభుత్వం రూ.48లక్షలతో టెండర్ వేయగా గుత్తేదారు సురేశ్ కైవసం చేసుకున్నాడు. సబ్ కాంట్రాక్టర్ రఘుపాల్‌రెడ్డి పనులు ప్రారంభించారు. అయితే పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో గుంటూరుకు చెందిన చిన్న అనే కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేశారు. గర్భ గుడి, ఉపాలయాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



కొనసాగుతున్న నిర్మాణ పనులు

ఎమ్మెల్యే సాయం కోసం..

అధునాతన పద్ధతిలో రాతి కట్టడాలతో నిర్మిస్తున్న శివాలయం ఎప్పుడు పూర్తవుతుందా అని భక్తులు ఎదురుచూస్తున్నారు. రూ.లక్ష విరాళం చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ తీర్మానించింది. కాగా ఆలయ పునర్‌నిర్మాణం కోసం ఎమ్మెల్యే విజయరమణారావు అదనంగా నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు వేగంగా జరుగుతున్నాయి



శివాలయం పునర్‌నిర్మాణంతో కొలనూర్‌కు పూర్వ వైభవం వస్తది. ప్రస్తుతం గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ వేగవంతంగా పనులు చేయిస్తున్నారు. దాతలు ముందుకువచ్చి సహకరించాలి.

– కలకొండ రాజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, కొలనూర్

ప్రకటించిన విరాళాలు చెల్లించాలి



కొలనూర్‌లో శివాలయం నిర్మాణానికి దాతలు మరింత సహకరించాలి. దాతలు ప్రకటించిన విరాళాలు చెల్లిస్తే పనులు మరింత వేగవంతం అవుతాయి. రాతి కట్టడాలతో నిర్మిస్తున్న ఆలయంతో గ్రామానికి పూర్వవైభవం వస్తది.

– బండారి ఐలయ్యయాదవ్, ధర్మకర్త, కొలనూర్

ఆధ్యాత్మికత నెలకొంటుంది



ఆలయం పునర్‌నిర్మించాక నిత్యపూజలు నిర్వహిస్తాం. అన్ని పండుగలతో పాటు, శివాలయంలో ఉత్సవాలు, నిత్యం భక్తుల పూజలతో గ్రామంలో ప్రశాంతత, ఆధ్యాత్మికత నెలకొంటుంది.

– నందగిరి అశోక్‌శర్మ, ఆలయ పురోహితుడు, కొలనూర్

అయ్యప్పస్వాములకు భిక్ష



వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని శాస్త్రినగర్‌లో అయ్యప్పస్వామి మండపం వద్ద అయ్యప్పస్వాములకు ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం గురుస్వాములు ఎమ్మెల్యేను సత్కరించారు. ఎమ్మెల్యే అయ్యప్పస్వామి నూతన సంవత్సరం క్యాలెండర్లు ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, రాజమల్లు, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, మాజీ ఏఎంసీ సాయిరి మహేందర్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, గురుస్వాములు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో వారంరోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత ప్రవచనాలలో భాగంగా శనివారం జూలపల్లిలో భక్తులు నగర సంకీర్తన చేశారు. ఆలయంలో గోమాత పూజ చేసి స్వామికి మొక్కులు చెల్లించారు. శ్రీమద్భాగవత ప్రవచకులు రమాదేవి, రామ్మోహనరావు దంపతులు, ఆలయ పూజారి ఉద్దండ నవీన్, మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, భక్తులు కూసి మహేశ్, నాగుల అన్వేష్, వైద్య ఆంజనేయులు, నిశాంత్‌రెడ్డి, కొండ శ్రీధర్, గంప రమేశ్, వజ్రారెడ్డి పాల్గొన్నారు.



మంథని: నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు, నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో కాంగ్రెస్ నాయకులు

మాజీ ప్రధానికి నివాళి

మంథని: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి శనివారం రాత్రి మంథనిలో పలువురు సంతాపం తెలిపారు. స్థానిక బతుకమ్మ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. నాయకులు టక్కేగారి కిట్టన్న, రఘోత్తంరెడ్డి, శశిభూషణ్ కాచే, వీకే రవి, మాచిడి రాము, రాపర్తి సంతోష్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ నూనేటి సంపత్యాదవ్, కాంగ్రెస్‌కు చెందిన మండల అధ్యక్షుడు గాజనేన సదయ్య, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై కాలనీ కాంగ్రెస్ నాయకులు శనివారం సంతాపం తెలిపారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్ సాగంటి శంకర్, మార్క రాజు, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, రాములు, అన్వర్, రాజేశం, సారయ్య నాయక్, ఓదెలు, నారాయణ, ప్రశాంత్, అవినాష్, రాజు, మహేశ్, రవి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యాలయంలో నాయకులు శనివారం మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు అవినాష్, దశరథం గౌడ్, మార్కండేయ, రాజయ్య, విజయ్, రవీందర్, సత్తయ్య, జగదీష్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఎన్టీపీసీలో టీఎన్జీవోల సభ్యత్వ నమోదు

జ్యోతినగర్: టీఎన్జీవో రామగుండం యూనిట్ ఆధ్వర్యంలో ఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఎన్టీపీసీలోని ఎఫ్‌సీఐ ఎక్స్ రోడ్‌లో నిర్వహించారు. సమావేశంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు, ఎంప్లాయ్ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు సూచించారు. కార్యదర్శి సందీప్‌రావు, ఉపాధ్యక్షుడు కొమురయ్య, పట్టణ కార్యదర్శి ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ కె.పి.సరిత, శివ, రామగుండం యూనిట్ సభ్యులు జగన్, అంజి, అలీ, రత్నం, శ్రీవాణి, స్వాతి, మధురిక, రీటాకుమారి పాల్గొన్నారు.

• రెండోరోజు జీపీ కార్మికుల సమ్మె

ఎలిగేడు: జీపీ, ఉద్యోగ కార్మికుల సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని శనివారం మండలకేంద్రంలోని బస్టాండులో సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ ఉద్యోగ, కార్మికులు రెండోరోజు సమ్మె చేపట్టారు. జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, నాయకులు ఇరుగురాల లచ్చయ్య, కవ్వంపల్లి దేవయ్య, కె.నారాయణ, నేరేడికొమ్మ సత్యనారాయణ, ఇరుగురాల శ్రీనివాస్, నర్సయ్య, కొండయ్య పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింది. సంఘం మండల అధ్యక్షుడు సంపత్, కార్మికులు బాణయ్య, భాస్కర్, లచ్చయ్య, నాగయ్య ఉన్నారు.

• ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో తులసీదళాల దండతో స్వామివారికి శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాకృష్ణ అష్టోత్తర పారాయణం చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా, కృష్ణాష్టకం పంచాయతీ స్తోత్రం తదితర స్తోత్రాలు పారాయణం చేశారు. భక్తులు స్వామివారికి గోదా అమ్మవారికి పలు మంగళహారతులు సమర్పించారు. వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

• మహిళా సంఘాలకు అవగాహన

జూలపల్లి: ఉపాధిహామీలో చేపట్టిన పనులు పర్యవేక్షించేందుకు గ్రామాల్లో వీఎంసీ కమిటీల నియామకంపై ఏపీఎం సదానందం శనివారం మహిళా సంఘాలకు కార్యాలయంలో అవగాహన కల్పించారు. సీసీలు మల్లేశం, శ్రీధర్, జ్యోతి, గ్రామైక్య సంఘాల సీఏలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

• సంపు నిర్మాణంలో జాప్యం

రామగుండం: చెత్త సేకరణకు కార్పొరేషన్ అధికారులు కేటాయించిన ట్రాక్టర్ కండిషన్ బాగా లేకపోవడం, తరచూ స్టార్ట్ కాకుండా మొరాయించడం, డివిజన్‌లో చెత్త సేకరణకు సరిపడా పారిశుధ్య కార్మికులను కేటాయించకపోవడంతో కాలనీల్లో చెత్త పేరుకోపోతోందని కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్ వాపోయారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లోని ఎత్తులో ఉన్న కాలనీలకు తాగునీటి సమస్య తీర్చేందుకు నిర్మాణంలో సదరు కాంట్రాక్టరు అలసత్వం వహిస్తుండడంతో నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

• అధికారులను కించపరిచే విధానం సరికాదు

రామగిరి: తన మనుగడ కోసం మంథని మాజీ ఎమ్మెల్యే దిగుజారుడు రాజకీయాలతో అధికారులను కించపరిచేలా మాట్లాడే విధానం మార్చుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న అధ్యక్షతన నాగెపల్లి బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుంటే తమ ఉనికిని కోల్పోతామని అబద్ధ ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయకులు తోట చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, మైదం వరప్రసాద్, ఎల్లె రామ్మూర్తి, మహేశ్, సమ్మయ్య, సదానందం, రాజ్‌కుమార్, సత్యం, శ్రీనివాస్, కండె పోచం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్ డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి నెలా 7లోగా వేతనాలు చెల్లించాలన్నారు. సీఅండ్ఎండీ ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు దాసరి అనిల్, సంతోష్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడే బ్లాస్టింగ్ నిర్వహించాలి

గోదావరిఖని: డీజీఎంఎస్ నిబంధనలకు లోబడి జీడీకే–5 ఓసీపీలో బ్లాస్టింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ కార్పొరేట్ ఎండీ ముస్తాఫా కోరారు. శనివారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతీరోజు నిర్వహించే బ్లాస్టింగ్‌లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్లాస్టింగ్ సమయంలో ఇళ్ల నుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ప్రభావిత డివిజన్‌లో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

రామగిరి: రత్నాపూర్‌లోని రాంనగర్‌ను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని శనివారం రాంనగర్ వాసులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. రాంనగర్ వాసులు వారి అవసరాల కోసం రత్నాపూర్ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ నాయకులు కుంట చక్రి, ఎండీ.యాసిన్, మామిడి మోహన్, సమ్మెట శ్రీకాంత్ పాల్గొన్నారు.

కవికి సన్మానం

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కవి, రచయిత నూనె రాజేశంను శనివారం ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. రాష్ట్ర సలహాదారు ఓరుగంటి ఆనంద్ ఇంటి ఆవరణలో కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల డైరీలను ముద్రిస్తామని ఆనంద్ తెలిపారు.

జూలపల్లి: మండల కేంద్రంలో ఇళ్ల ముందు నాటిన హరిత మొక్కల రక్షణకు ముళ్ల కంప నాటడంతో ఇంటి యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శనివారం ‘సాక్షి’లో వచ్చిన కథనానికి ఈజీఎస్ సిబ్బంది స్పందించారు. వెంటనే ముళ్ల కంపను తొలగించి జాలీలు ఏర్పాటు చేశారు. దీంతో ఇంటి యజమానులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.



అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఆంజనేయులు



మంథని: మంథని సీనియర్, జూనియర్ కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది బొట్ల ఆంజనేయులును నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం లా, లెజిస్లేటర్ సెక్రటరీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గాయత్రీ విద్యానికేతన్‌లో రైమ్స్ ఫెస్ట్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్‌లో శనివారం రైమ్స్ ఫెస్ట్ నిర్వహించారు. చిన్నారుల మానసిక సంతోషం కోసం రైమ్స్ ఫెస్ట్ నిర్వహించినట్లు కరస్పాండెంట్ రజనీ, శ్రీనివాస్ తెలిపారు. వివిధ వేషధారణలతో వచ్చిన చిన్నారులు ఇంగ్లీష్, హిందీ, తెలుగు రైమ్స్‌కు అనుగుణంగా ఇచ్చిన ప్రదర్శనలు అలరించాయి.

సాగునీటి కోసం కష్టాలు

కాల్వశ్రీరాంపూర్: యాసంగి పంట సాగు కోసం మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ బంగారి లావణ్య రమేశ్, మరి కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు శనివారం కాలువల్లో పేరుకుపోయిన ముళ్లపొదలు, పూడికను తొలగించారు. కాలువల్లో దిగి ముళ్లచెట్లను నరికి బయట ఒడ్డుపై వేస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని తవ్వి బయట పోస్తున్నారు.

‘మా గ్రామాన్ని సర్వారంలో కలపొద్దు’

ముత్తారం: మండలంలోని నూతన పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్న సర్వారంలో తమ గ్రామాన్ని కలపొద్దని కాజిపల్లి గ్రామస్తులు శనివారం ఎంపీడీవో సురేశ్‌కు వినతిపత్రం అందచేశారు. తమ గ్రామం ప్రస్తుతం లక్కారం పంచాయతీ దగ్గర ఉంటుందని, సర్వారంలో విలీనం చేసే పక్రియ విరమించుకోవాలన్నారు. లక్కారం మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, స్థానికులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రదర్శన ఇస్తున్న కళాబృందం

గోదావరిఖని: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్‌నగర్‌లో కళాబృందాల ద్వారా శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈవ్‌టీజింగ్, మహిళా వేధింపులపై పోలీసుశాఖ కఠినంగా ముందుకు సాగుతున్నామన్నారు. ట్రిబుల్ రైడింగ్, అధిక వేగం, సైలెన్సర్లు లేకుండా తిరిగే బైక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్‌క్రైం, ఐడీ లిక్కర్ కేసుల తీరుపై వివరించారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.